బస్టాండ్‌లో సమస్యల హారన్

- ప్రయాణికులకు కనీస సదుపాయాలు కరువు
- బస్టాండ్‌లో రోడ్డు, తాగునీరు లేని వైనం
- కూర్చునేందుకు సరిపడా బెంచీలు లేవు
- దేవస్థానం, ఆర్టీసీలకు లక్షల్లో ఆదాయం
- పిల్లలతో దర్శనానికి వెళ్లే వారి పరిస్థితి దయనీయం



బస్టాండ్‌లో బస్సుల కోసం నిలబడి ఎదురు చేస్తున్న ప్రయాణికులు

భీమడోలు: భీమడోలు బస్టాండ్‌లో సమస్యల హారన్ మోగుతోంది. జాతీయ, రాష్ట్రీయ రహదారులకు కూడలిగా ఉన్న ఈ బస్టాండ్‌లో తాగునీరు, కూర్చునేందుకు సరిపడా బెంచీలు లేకపోవడం, మరమ్మతులకు గురైన టాయిలెట్ల వలన భక్తులు ఇబ్బందులు పడడం, భక్తులకు సరైన భద్రతా సదుపాయాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఏన్నో ఏళ్లుగా బస్టాండ్‌లోని రోడ్డును పట్టించుకోకపోవడంతో భారీ గుంతలతో నిండిపోయింది. దీంతో ద్వారకాతిరుమల ప్రయాణం నరకప్రాయంగా మారింది. బస్టాండ్‌ను అటు ద్వారకాతిరుమల దేవస్థానం, ఇటు ఆర్టీసీ అధికారులూ పట్టించుకోకపోవడంతో వారి పనితీరును బాహాటంగా విమర్శిస్తున్నారు. ఈ రెండు శాఖలకు లక్షలాది రూపాయల ఆదాయం ఈ బస్టాండ్ ద్వారా సమకూరుతున్నా.. బస్టాండ్ ఆలనాపాలనా పట్టించుకున్న నాధులే కరువయ్యారు.

సుమారు 100 బస్సులు, 5 వేల మందికి పైగా ప్రయాణం

జాతీయ, రాష్ట్రీయ రహదారులకు జంక్షన్‌గా ఉన్న భీమడోలు బస్టాండ్ నుంచి ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి భక్తులు, ప్రయాణికులు, జనం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. సెలవుల్లో ఈ సంఖ్య రెట్టింపు అవుతుంది. మెట్ట, డెల్టా ప్రాంతాలైన 50 గ్రామాలకు ఇదే ప్రధాన బస్టాండ్. సుదూర ప్రాంతాల నుంచి ద్వారకాతిరుమలకు వెళ్లేందుకు భక్తులకు ఈ బస్టాండ్ నుంచి రాకపోకలు సాగించాల్సిందే. లక్షల్లో ఆదాయం అందించే బస్టాండ్ నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. అసలే బస్టాండ్ ఇరుకుగా ఉండడంతో వర్షా కాలంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు పెంచకపోవడం, ఎక్స్‌ప్రెస్‌లు ఆపకపోవడం వంటి కారణాలతో భక్తులు ప్యాసింజర్ బస్సుల్లోనే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు బస్టాండ్‌లో కనీస సదుపాయాలు లేక గంటల తరబడి వేచి ఉండే ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. పిల్లలతో దర్శనానికి వెళ్లే తల్లిదండ్రులు నానా అగచాట్లు పడుతున్నారు. స్త్రీ శక్తి పథకంతో ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల రద్దీ పెరిగింది. అయితే సదుపాయాలు కల్పించకపోవడంతో దొంగలు హల్‌చల్ చేస్తూ భక్తుల జేబులు ఖాళీ చేస్తున్నారు. వారి భద్రత పెద్ద సమస్యగా మారింది. హోంగార్డును నియమించాలని భక్తులు కోరుతున్నారు.

అధ్వానంగా రహదారి

బస్టాండ్‌లోని లోపల, బయట మార్గాల్లో ఏర్పడిన గుంతల వలన బస్సుల్లోని అడుగు భాగాలు ధ్వంసమవుతున్నాయి. భారీ గుంతల్లో పడిన బస్సులు మరమ్మతుల పాలవుతున్నాయి. ఆగుంతల్లో బస్సులు వెళ్లే తరుణంలో ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. ఆరేళ్ల క్రితం ద్వారకాతిరుమల దేవస్థానం అధికారులు కేవలం గ్రావెల్ రోడ్డు వేసి వదిలేశారు. దీంతో ఆ గ్రావెల్ వర్షాలకు పైకి లేచి గుంతలుగా మారాయి. వర్షంవస్తే ఆ గోతులు ప్రాణ సంకటంగా మారాయి. కనీసం రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై దేవస్థానం అధికారి చరణ్‌ను వివరణ కోరగా రోడ్డు నిర్మించే ప్రతిపాదన ఏమీ లేదన్నారు. అయితే టాయిలెట్ల మరమ్మతులు చేపడతామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులులేకుండా అన్ని చర్యలు దేవస్థానం అధికారులు తీసుకుంటున్నారు.

బస్టాండ్‌ను పట్టించుకోవడం లేదు



చిన్న వెంకన్నను దర్శించుకునే భక్తులు ఈ బస్టాండ్ నుంచి రాకపోకలు సాగించాలి. దీంతో బస్టాండ్‌లో కనీసం భక్తులకు ఎటువంటి సదుపాయాలు లేవు. ప్రధానంగా రోడ్డు అధ్వానంగా ఉంది. గత ఏడేళ్లుగా సంబంధిత అధికారులు గాని పాలకులు గాని పట్టించుకోవడం లేదు. దేవస్థానానికి కానుకల ద్వారా ఆదాయం కావాలి. ప్రయాణికుల నుంచి వచ్చే చార్జీలతో ఆర్టీసీ ఆదాయం వస్తుంది. రెండు శాఖలకు ఆదాయాలు సమకూరుతున్నా, బస్టాండ్‌ను పట్టించకపోవడంతో అధ్వానంగా మారింది. దేవస్థానం అధికారులు స్పందించి సీసీ రోడ్డు వేసి భక్తులకు కనీస సదుపాయాలు కల్పించాలి.

– ఆర్.లింగరాజు, సీపీఎం జిల్లా నాయకుడు, భీమడోలు



బస్టాండ్‌లో ఏర్పడిన భారీ గుంత



గుంతలతో నిండిన బస్టాండ్ ప్రాంగణం

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసిన నౌడు వెంకటరమణ

భీమడోలు: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ మర్యాద పూర్వకంగా కలిశారు. పలు అంశాలపై వైఎస్ జగన్‌తో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎరువుల బ్లాక్‌మార్కెట్‌పై వైఎస్సార్ సీపీ తలపెట్టిన అన్నదాత పోరు విజయవంతం కావడం, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతి ఆరోపణలు, చంద్రబాబు చేస్తున్న కుతంత్రాలు, కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టేలా పార్టీశ్రేణులను అప్రమత్తంచేయడం వంటి అంశాలపై చర్చించినట్లు వెంకటరమణ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

దెందులూరు: గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ శాఖ ఏలూరు రూరల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం దెందులూరులో పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. దెందులూరు 9వ వార్డు సెంటర్‌లో వాటర్ సర్వీసింగ్ ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మీటరును ఏర్పాటు చేశారు. విద్యుత్ వినియోగం రీడింగ్ ద్వారా స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఆయన వెంట దెందులూరు మండలం అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్లు ఉన్నారు.

ఉపాధిలో మామిడి మొక్కల సాగు



ఉపాధి హామీ పథకంలో సాగు చేస్తున్న మామిడి మొక్కలు

దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకంలో సాగు చేస్తున్న మామిడి రైతులు ఉపాధి పథకం రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ ఫాతిమా ప్రసన్న తెలిపారు. బుధవారం పెరుగ్గూడెం గ్రామంలో సాగు చేస్తున్న మామిడి మొక్కలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఒక ఎకరంలో సాగు చేస్తున్న 708 మొక్కలను చూశారు. మెట్ట ప్రాంతాల్లో మామిడి సాగుకు అనువుగా ఉన్న నేపథ్యంలో రైతులు శ్రద్ధతో మామిడి పెంపకం అధికమయ్యేలా బలోపేతం చేసేలా అధిక దిగుబడులు సాధించేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. మండల టెక్నికల్ అసిస్టెంట్ దీప్తి, పెరుగ్గూడెం ఫీల్డ్ అసిస్టెంట్ శివ, రైతులు పాల్గొన్నారు.

లెప్రసీ బాధితులకు పండ్లు పంపిణీ



లెప్రసీ బాధితులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఫాదర్ అమ్మన్‌రాజా

దెందులూరు: లెప్రసీ బాధితులకు సేవలందించడం దేవుని సేవతో సమానమని దెందులూరు ఆర్‌సీఎం చర్చ్ ప్యారిస్ ప్రీస్ట్ ఫాదర్ జి.అమ్మన్‌రాజా అన్నారు. బుధవారం వేగవరం డామియల్ లెప్రసీ సెంటర్‌లో చికిత్స పొందుతున్న లెప్రసీ బాధితులను ఫాదర్ అమ్మన్‌రాజా పరామర్శించారు. ఆరోగ్య వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఉంగుటూరు: భూమి కోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన చిట్యాల ఐలమ్మను రజకులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిప్పర ప్రసాద్ పిలుపునిచ్చారు, గొల్లగూడెం రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు పిప్పర ప్రసాద్, పిప్పర సత్యనారాయణ, పిప్పర కృష్ణ, దాసరి సత్యనారాయణ, పల్లంట్ల శ్రీనివాస్, దాచేపల్లి దుర్గారావు, బాలయ్య పాల్గొన్నారు.

శిరోమణికి సంతాప సభ

ఉంగుటూరు: ఉంగుటూరుకు ఎన్నో సేవలు అందించిన ఎస్‌ఆర్‌ఐ డాక్టర్ నాగ శిరోమణి సంతాప సభను నేడు గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు డాక్టర్ పాతూరి శివన్నారాయణ కమ్మ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో శిరోమణికి నివాళులర్పించారు.

యువత మానసిక ఒత్తిడిని జయించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ప్రతినిధులు

పెదపాడు: యువత మానసిక ఒత్తిడి కుటుంబ, ఆర్థిక సమస్యల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఒత్తిడిని జయించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి సతీష్ తెలిపారు. పెదపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. విద్యా ర్థులకు ఆత్మహత్యలకు దారితీసే పరిస్థితుల గురించి వివరించారు. అనంతరం కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మహత్య ఆ లోచన వచ్చినప్పుడు మానసిక వైద్యులను సంప్రదించాలని సూచించారు. జూనియర్ కళాశాల సిబ్బంది, డీడీఆర్‌సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమాపై అవగాహన ఉండాలి

నిడమర్రు: బ్యాంక్ బీమా పథకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సొసైటీ చైర్మన్ కందులపాటి సత్యనారాయణ అన్నారు. బుధవారం నాబార్డు ఆధ్వర్యంలో పెదనింద్రకొలను సొసైటీ ఆవరణలో రైతులకు, సొసైటీ ఖాతాదారులకు డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు.

12 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు

దెందులూరు: గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయంలో ఈ నెల 12 నుంచి 18 వరకు అర్ధ సంవత్సర పరీక్షలు నిర్వహిస్తామని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ బూర్ సింగ్ మీనా అన్నారు. బుధవారం కేంద్రీయ విద్యాలయంలో ఆయన మాట్లాడుతూ మూడో తరగతి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈ నెల 18 వరకు పరీక్షలో జరుగుతాయన్నారు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ



వైఎస్సార్ సీపీ నేత సుబ్బారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందని, ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తెలిపారు. బుధవారం సాయంత్రం పెదపాడు మండలంలోని గుడిపాడు, పెదపాడు, కొణికి, దాసరిగూడెం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించారు. గుడిపాడులో అనారోగ్యంతో బాధపడుతున్న ఘంటసాల సుబ్బారావు నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పెదపాడులో గోకా శంకరరావు కుటుంబ సభ్యులను, కొణికి గ్రామంలో తమలాల శ్రీనివాసరావు, దాసరిగూడెంలో తంబి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, ఏలూరు మండల కన్వీనర్ తేరా ఆనంద్, సీనియర్ నాయకులు ఆళ్ల సతీష్‌చౌదరి, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌బాబు, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, వడ్డికార్పొరేషన్ మాజీ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, నాయకులు అక్కినేని రాజశేఖర్, ఘంటసాల ప్రభాకరరావు, సంబంగి శ్రావణ్‌కుమార్, ముంగర ఉమామహేశ్వరరావు, బత్తుల ఏసురాజు, పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి

భీమడోలు: గ్రామ పంచాయతీలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భీమడోలు ఎంపీపీ కనుమాల రామయ్య అన్నారు. భీమడోలు ఎంఆర్సీలో బుధవారం పంచాయతీల పురోగతి సూచికలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులకు ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో, కన్వీనర్ సీహెచ్ పద్మావతిదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ కనుమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ పాల్గొని మాట్లాడారు. పంచాయతీలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ప్రణాళిలను తయారు చేసుకోవాలన్నారు. గ్రామాల్లోని అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పంచాయతీల్లో అమలు చేసి గ్రామాభివృద్ధి సాధనకు సహకరించాలని కోరారు. సూరప్పగూడెం పంచాయతీ కార్యదర్శి టి.ముత్తయ్య మాస్టర్ ట్రెనీగా వ్యవహరించారు. గ్రామ పంచాయతీలు పురోగతి సూచికలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో శర్మ, ఈవోపీఆర్‌డీ సుబ్బారావు, పలు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పంచాయతీ ప్రగతి నివేదికపై శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి

దెందులూరు: సర్పంచులు, ఎంపీటీసీలు పాలనాపరమైన అవగాహన పెంపొందించుకొని పంచాయతీరాజ్ చట్టానికి అనుగుణంగా నిధులు నిర్వహించాలని ఎంపీడీవో డ్వామా ఏలూరు జిల్లా ఫైనాన్స్ మేనేజర్ కె.శ్రీదేవి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ సమావేశం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, హక్కులు, విధులు శాఖాపరమైన నిబంధనలు, సమావేశాల శిక్షణపై సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. సమావేశంలో ఏవో భీమరాజు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వర్మ పీఆర్‌ఏఈ చౌదరి వెలుగు ఏపీఎం సురేష్ ఉపాధి ఏపీఓ ఫాతిమా ప్రసన్న గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దెందులూరుతో ప్రత్యేక అనుబంధం

దెందులూరు: దెందులూరు మండలం నాకు ప్రత్యేకమని ఈ మండలంలో రెండు సార్లు ఎంపీడీవోగా పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానని డ్వామా ఏలూరు జిల్లా ఫైనాన్స్ మేనేజర్ కె.శ్రీదేవి అన్నారు. బుధవారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సన్మాన సభలో ఆమె మాట్లాడా రు. కార్యక్రమంలో దుర్గారావు, సుధీర్, ప్రసాద్ ఆమె సేవలను అభినందించారు. సీనియర్ అసిస్టెంట్ అనూష, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ కళాశాలలో ఓపెన్ జిమ్



వ్యాయామ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ఇకపై వ్యాయామ అధ్యాపక విద్యార్థులకు ఓపెన్ జిమ్ సౌకర్యం కలగనుంది. ఓపెన్ జిమ్ ద్వారా విద్యార్థులకు అధిక శారీరక దారుఢ్యం, నిరంతర వ్యాయామం చేసుకోవడానికి వీలు కలుగుతుంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేల్, బీపీఈడీ యూజీడీ విద్యార్థుల వ్యాయామ అవసరాలు దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛంద సేవా సంస్థ తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయులు కలిసి విద్యార్థుల వ్యాయామ అవసరాలను వివరించారు. వెంటనే అంగీకరించడమే కాకుండా రూ.5 లక్షలు కళాశాలకు ఓపెన్ జిమ్ నిమిత్తం ప్రకటించారు. దీంతో వ్యాయామ కళాశాలలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం ఓపెన్ జిమ్ నిర్మాణాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

చిన్నారులకు టీకాలు

దెందులూరు: చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించకుండా వ్యాధి నిరోధక టీకాలు చేయించాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం కొవ్వలి-1 పరిధిలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఏఎన్ఎం కుమారి, లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రవల్లిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత నిర్ణయం మానుకోవాలి



భీమడోలు: పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు



ఉంగుటూరు: సమావేశంలో మాట్లాడుతున్న డీటీ పోతురాజు

భీమడోలు: జాతీయ, రాష్ట్రీయ రహదారులను కలిపే భీమడోలు రైల్వే గేటును మూసివేస్తే జనజీవనం అస్తవ్యస్తంగా మారుతుందని, రైల్వే గేటు మూసివేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ గ్రామస్తులు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం భీమడోలు రైల్వే గేటు మూసి వేయాలన్న నిర్ణయంపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు గ్రామసభను ఏర్పాటు చేశారు. రైల్వే గేటు మూసి వేసేందుకు రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయాన్ని సంబంధిత అధికారులు గ్రామస్తులకు వివరించారు. దీంతో వారు రైల్వే గేటు మూతను ముక్తకంఠంతో వ్యతిరేకించారు. అనంతరం వినతి పత్రాన్ని అందించారు. భీమడోలు పంచాయతీ పరిధిలోని పెదలింగంపాడు, చినలింగంపాడు, దిగురుపాటి దిబ్బ గ్రామాలకు చెందిన 3 వేల మంది, 5 వేల ఎకరాల్లోని వరి చేలు, ఆక్వా చెరువులు రైల్వే గేటుకు అవతల పక్క ఉన్నాయని, నిత్యం ఆ గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు భీమడోలు గ్రామానికి రాకపోకలు సాగిస్తున్నాయని, రైల్వే గేటు మూసి వేస్తే వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుందని, దీని వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వారు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే గేటు మూసివేతను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని పంచాయతీ కార్యదర్శి కేవీ తనూజ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి, వీఆర్వోలు వెజ్జు వినయ్, వీరప్రతాప్, గ్రామ ప్రముఖులు చింతా శ్రీరామచంద్రమూర్తి, కుక్కల ప్రసాద్, పైడిమాల యుగంధర్, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, ఈతకోట సత్యకృష్ణ, ఆదిరెడ్డి సత్యనారాయణ, వెంకటరమణ, రామిశెట్టి గోపి, బెంజిమన్ పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి సహకరించాలి

ఉంగుటూరు: ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయితే రైల్వే గేటు సమస్య ఉండదని డీటీ పోతురాజు తెలిపారు. బుధవారం కైకరం పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలకు ఫ్లై ఓవర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీటీ మాట్లాడుతూ ఫ్లైఓవర్ మంజూరైందని నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు. వీఆర్వో నాగేశ్వరరావు, సర్పంచి సలగల గోపి, సర్వేయర్లు, ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో రవి ప్రసంగం

ఉంగుటూరు: విశ్వవిద్యాలయ ఆచార్యులకు మాత్రమే లభించే అరుదైన గౌరవాన్ని నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు కొండా రవి దక్కించుకున్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో భారతీయ భాషా సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులో గల ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నిర్వహించిన తెలుగు భాషా పరిణామంలో మైలురాళ్లు అనే కార్యక్రమంలో కొండ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు, సిబ్బంది అభినందించారు.

ఎన్‌సీసీతో ఉపాధి మెండు



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్స్

భీమడోలు: జాతీయ కేడెట్ దళం(ఎన్‌సీసీ)లో సీ సర్టిఫికెట్లు పొందిన యువతకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ బొమ్ము రవికుమార్, సత్యనారాయణ అన్నారు. భీమడోలు శ్రీవేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన 32 మంది ఎన్‌సీసీ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించి సీ, బీ సర్టిఫికెట్లను ఏలూరులోని 19 (ఏ) బెటాలియన్ ఎన్‌సీసీ కార్యాలయం వద్ద సంబంధిత అధికారుల నుంచి అందుకున్నారు. అనంతరం భీమడోలు కళాశాల వద్ద బుధవారం సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్స్ బొమ్ము రవి కుమార్, సత్యనారాయణ,ఎన్‌సీసీ అధికారి కె.శివశంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవన ఎరువులతో భూమికి ఆరోగ్యం



పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న అధికారులు

ఉంగుటూరు: జీవన ఎరువుల వాడకంతో భూమి ఆరోగ్యంగా ఉంటుందని మండల వ్యవసాయఅధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం చేబ్రోలు గోపీనాథపట్టణంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి అమరనాథ్, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సార్వా సాగులో మెలకువలు పాటించాలి

భీమడోలు: సార్వా సాగులో మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులను వాడితే పంట పై తీవ్ర ప్రభావంతో చీడపీడలు సోకుతాయని మండల వ్యవసాయాధికారిణి ఉషారాణి అన్నారు. పూళ్ల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో కలిసి వారు పంట చేలను సందర్శించారు. రైతులకు సాగులో మెలకువలను వివరించారు. రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలి

పెదపాడు: వ్యవసాయాధికారుల సూచనల మేరకు యూరియాను వినియోగించాలని ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి అనిల్‌కుమారి తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్ఎస్‌సీఎస్ త్రీమెన్ కమిటీ చైర్మన్ కర్రె బాలస్వామి, మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామీ ఖాసిమ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరిలో యూరియా మితంగా వాడాలి

పెదవేగి: వరి పంటలో యూరియాను మితంగా వాడాలని సహాయ హార్టికల్చర్ డైరెక్టర్ సంతోష్ అన్నారు. బుధవారం పెదవేగి మండలం కొప్పాక-అంకనగూడెం ఆర్ఎస్‌ఏలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. సహాయ హార్టికల్చర్ డైరెక్టర్ సంతోష్, మండల వ్యవసాయ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు రైతులకు వరి, తోట పంటల నిర్వహణపై అవగాహన కల్పించారు.

ఎరువుల వాడకంలో అవగాహన కలిగి ఉండాలి

దెందులూరు: రైతులు ఎరువుల వాడకంలో అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎల్.శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం శ్రీరామవరంలో రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో రామారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.కోటేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో సాగాలి

గణపవరం: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ప్రభుత్వ డిగ్రీకాలేజి ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం ఆమె కాలేజీలో ఎంపవరింగ్ విలేజెస్, రూరల్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ఫర్ సస్టైనబుల్ గ్రోత్ అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వర్కుషాపులో మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూడటం కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగడానికి కృషి చేయాలన్నారు. రిసోర్స్‌పర్సన్ చంద్రశేఖరరావు మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగే అవకాశాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ స్వరూపరాణి, ఐక్యుఏసి కోఆర్డినేటర్ కెవి గణేష్ కుమార్, ఇంక్లూసివ్ సెంటర్ కో-ఆర్డినేటర్ సీహెచ్ అనూరాధ, ఇంక్యుబేషన్ సెంటర్ కోఆర్డినేటర్ జివి శారదాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ శిక్షణ తరగతులకు 180 మంది విద్యార్థులు హాజరయ్యారు.